
# రోడ్డు

– ఆకెళ్ళ నాగశ్రీనివాస్



దూరంగా ఏదో అలికిడైనట్టుగా అనిపిస్తే కళ్ళు తెరిచి చూశాను. లైటు కాంతి సూటిగా కళ్ళలో పడుతోంది. కళ్ళు చిట్లించి చూశాను. అలికిడి దగ్గరైంది. ఇప్పుడు రూపం స్పష్టంగా వుంది.

ఓ.... అతను నాకు చాలా రోజులుగా తెలుసు. బాగా దగ్గరకంటా వచ్చాడు. గుప్పుమని సారా వాసన కొట్టింది. అతను మత్తు నిండిన తన కళ్ళను బరువుగా కదిల్చి నావైపు చూశాడు. నేను అభావంగా అతనివైపు చూశాను.

ఎవరో సైకిలు తొక్కుకుంటూ నా మీద నుంచి వెళ్ళిపోయారు. నేను చిన్నగా దగ్గాను. రెండురాళ్ళు కదిలాయి. అతను అటూ, ఇటూ చూసి ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక నాతో

19–1–96 ఆంధ్రజ్యోతి వారపత్రిక

మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నిజం చూసి నిబ్బరంగా ఎలా పడుకుంటున్నావ్ నువ్వు? గుండెల్ని మండించే నిజాన్ని ఆర్పేయడానికి ఇదుగో...దీన్ని వాడుతుంటాం మేం!" చేతిలోని చిన్న సీసాని చూపిస్తూ చెప్పాడు.

అంతా నిశ్శబ్దం ఆవరించి ఉంది. అతను మాట్లాడుతుంటే నిశ్చలమైన చెరువులోకి రాళ్ళు విసురుతున్నట్టు వినిపిస్తోంది. ఓ కుక్క మెల్లగా నా పక్కనుంచి నడిచి వెళ్ళిపోయింది. అతను మళ్ళీ నాతో అన్నాడు "చూశావా! రాత్రైతే చాలు నీకు విశ్రాంతి. ఎవ్వరూ నిన్ను డిస్టర్బ్ చేయరు. నిన్నటి దాకా నేనూ అంతే అనుకో. తిండి లేకపోయినా నిద్రకి లోటుండేది కాదు. యూసీ! చాలామంది కుహనా మేధావులకి మల్లేనే అబద్ధాలు చెప్పను."

చేతిలోని బాటిల్ ఒక్క గుక్కలో ఖాళీచేసి దూరంగా విసిరేసాడు. నా ఎడమ చేతికి దూరంగా పోయి పడింది.

"కళ్ళతో చూసిన నిజం విచిత్రంగా కడుపులో తిప్పుతోందేవిటి?" ఎగదన్నుకొస్తున్న త్రేన్పుని ఆపుకుంటూ చెప్పాడు. ఎవరో కుర్రాడు తనలో తాను పాడుకుంటూ వెళుతున్నాడు. "తుపాకి లోడుచేసి గురిపెట్టి కాలిస్తే హృదయాలు గాయపడునా...?" మెల్లగా పాట దూరమైపోయింది.

"ఎవడు రాసిందది? తుపాకితో కాలిస్తే హృదయం గాయపడక, గంతులేస్తుందామరి. వార్నీ! బొత్తిగా కామన్‌సెన్స్ లేకుండా పోతోంది జనానికి" మళ్ళీ నావైపు చూశాడు.

"ఫ్రెండూ! మర్చిపోలేదు నిన్ను. కుర్రాడు కొత్తపాట పాడుకుంటూ వెళ్ళిపోతున్నాడు కదా. అందుకని కొంచెం కరెక్ట్ చేసి...ఇంకొంచెం ఎడ్యుకేట్ చేసి...ఇంకా కొంచెం" కొద్దిసేపు ఆగి కంటిన్యూ చేశాడు.

"అదేలే ఇంకా ఏదో చేద్దామనుకొన్నాను. Digression No! టాపిక్‌లోకి వచ్చేస్తాను. మందుకొట్టిన మనిషంటే లోకానికి బొత్తిగా గౌరవం పోయింది. కథల్లోనూ...సినిమాల్లోను చూడు! అప్పటిదాకా మామూలుగానే మాట్లాడతాడు. 'కొంచెం' మందు 'గటగటా' తాగేయగానే 'షూడు షంపేష్తాను' అంటూ 'ష' భాష మాట్లాడేస్తారు'. నాన్‌స్టాప్‌గా అంతసేవు మాట్లాడేసరికి కంట్రోల్ వదిలేసి నా మీద కూర్చుండిపోయాడు. నాకు కొంచెం బరువనిపించింది.

అతని నోట్లోంచి లాలాజలం క్రింది పెదవి మీదుగా గడ్డం మీదకి, అక్కణ్ణించీ నా మీదకి పడుతోంది. అతనదేం పట్టించుకోకుండా మాట్లాడుతున్నాడు.

"నిజానికి మందు కొట్టడం అంటే ఎంత కష్టమైన పని. కషాయంలాంటి విషాన్ని కంఠంలోకి దించేసి కడుపులో దాచేసుకుని చిర్నవ్వుతో ప్రపంచాన్ని చూడ్డమంటే మాటలా! ఈ కబుర్లు చెప్పే వాళ్ళందర్నీ వచ్చి తాగి చూపించమను. ఒక్క చుక్క తాగితే లీటరు డోక్కుంటారు మరి...తాగడానికీ ఓ పద్ధతుంది. అందులోనూ నాలాటి తెలివైనోళ్ళు పర్సన్ ఉంటేనేగానీ తాగరు...నిజమేనా?" నన్నడిగాడు.

నేనేం మాట్లాడలేదు.

"నువ్వేం చెబుతావులే! నువ్వు తాగలేవుగా. పోనీ నేనెందుకు తాగానో తెల్సా? మనిద్దరం నిన్ననే ఓ నిజం చూశాం. దొంగనాయాళ్ళు నిజాన్ని చంపేయమనీ లేకపోతే నన్ను చంపేస్తామనీ అంటున్నారు. నిన్నడిగే దమ్ములేక...బలహీనుణ్ణి...నన్ను వేధిస్తున్నారు."

ప్రేలాపన సన్నగా రోదనలోకి మారింది. "నేను దాచలేక పోతున్నాను. నిజం..." ఓ దగ్గు తెర అతన్ని కుదిపేసింది. నామీదే కక్కేసాడు. అతని ఎర్రటి కళ్ళు నిస్తేజతని సంతరించుకుంటున్నాయి. అతను అతి కష్టంమీద లేచి నుంచున్నాడు. మాట స్థాయి బాగా తగ్గిపోయింది. తూలుతూ నడవటం మొదలుపెట్టాడు. నా పొట్టమీంచి గుండెల మీదుగా ముఖం దగ్గరికి వచ్చాడు. "లం... కొడుకులు" - ఏదో మెల్లగా సంస్కార హీనంగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

కొద్దిగా ఆగాడు. స్థిరంగా నిలబడ్డానికి ప్రయత్నిస్తూ నాకూ, ప్రక్కనున్న చెట్లకూ, లైట్లకూ చెపుతున్నట్టుగా పెద్దగా అరిచాడు.

"నిజం వదులు

ఇజం వదులు

బతకటానికదే సులువు"

శిథిలమైపోయిన అతని చెప్పులు నా కళ్ళ మీదుగా సాగిపోయాయి.

* * *

ఆకాశం ఊదా రంగు దుప్పటి కప్పుకున్నట్టుంది. నాకెందుకో సూర్యోదయం చూడగానే భూపాల రాగం గుర్తురాదు. జనం నోట వార్తల సుప్రభాతం విన్నందువల్లనేమో...'ఆకాశం అనాథ శవాల్ని తగలబెడుతున్నప్పటి మంటలా తీక్షణంగా కనిపిస్తుంది'.

రోజూలానే అదీ మామూలు రోజే. నా కాళ్ళ దగ్గర పాల వ్యాను ఆగి ఉంది. రిటైర్డ్ మాస్టారూ, వాళ్ళెదురింటాయనా పాల ప్యాకెట్లతో ఇంటికిపోతూ దినపత్రిక సిగరెట్‌ను వెలిగించారు.

చదువు చెప్పడం కంటే చదవడంలోనే ఆనందం ఉందో ఏమో, మాస్టారు హెడ్ లైన్స్ పైకి చదువుతూ నడుస్తున్నాడు.

"రైలు, పట్టాలు తప్పి 27 మంది దుర్మరణం. రైలు పట్టాలు కాక, దారి తప్పతుందా!" తన జోక్‌కి తనే నవ్వుకుంటూ వార్తా వినోదం కొనసాగించాడు.

ఎదురింటాయన రోజూ అలవాటయిన చావు వార్తలు శ్రవణానందకరంగా వింటున్నాడు. మాస్టారు సడన్‌గా కంఠం ఎక్స్‌ప్రెసివ్‌గా మార్చి "ఇది చూశారా! మన ఊళ్ళోనే ఎవరో అమ్మాయిని దారుణంగా చంపేశారట" అన్నాడు. ఆశ్చర్యంగా చూస్తున్న ఎదురింటాయనకి మరిన్ని విశేషాలు అందించాడు.

"అదేనండీ మొన్న రాత్రి ఇదే రోడ్డులో ఏదో హత్య జరిగిందని కర్ణాకర్ణిగా విన్నాం కదా! దాని గురించే రాశారు. పట్టుమని పద్దెనిమిదేళ్ళు కూడా లేవట అమ్మాయికి. బహుశా ఆస్తి వ్యవహారాల్లో దాయాదులు ఈ పని చేసుండవచ్చని భావిస్తున్నారట. మన టూటవున్ ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు. ఎవరో ప్రత్యక్ష సాక్షి ఉన్నాడనే, కారణాంతరాలవల్ల అతని వివరాలు గోప్యంగా ఉంచారనీ రాశారు.

ఆ తర్వాత వాళ్ళు మాట్లాడుకున్నవేవీ నేను విన్లేదు. నిన్న రాత్రి వెళ్ళిపోతూ అతను చివర్న

## అమితాబ్ బాటలో మరో ఇద్దరు

పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్టు అమితాబ్‌బచ్చన్ 'ఎ.బి.సి.ఎల్.' సంస్థను చూసి సుధాకర్ బొకాడే కూడా 'ఎస్.బి.సి.ఎల్.' (సుధాకర్ బొకాడే కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థను స్థాపించాడు. తన సంస్థ నుంచి 5 సినిమాలు విడుదల కానున్నట్టు ప్రకటించిన సుధాకర్ అక్కడితో ఆగకుండా 'దివ్య ఆడియో' పేరుతో ఓ మ్యూజిక్ కంపెనీని కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించి 'ఔరా' అనిపించాడు! ఇదిలా వుంటే ముఖేష్ దుగ్గల్ కూడా రంగ ప్రవేశం చేసి 'ఎం.డి.సి.ఎల్.' అనే సంస్థను స్థాపించి 25 టీవీ సీరియల్స్‌నూ, 18 ఫీచర్ ఫిల్మ్‌లనూ నిర్మిస్తున్నట్టు ప్రకటించాడు. ఈ ఇద్దరూ కార్యాచరణలో ఏపాటి సత్తా చూపగలరో చూద్దాం!

— సత్యశ్రీ

చెప్పిన మాటలే నా చెవుల్లో గింగిర్లెత్తుతున్నాయ్. మళ్ళీ జీవితం మొదలయిందని గుర్తుచేస్తూ ఓ లారీ ఏమరుపాటుగా వున్న నా మీద నుంచి దూసుకుపోయింది. బాధతో నే పెట్టిన కేక ఫ్యాక్టరీ సైరన్‌లో కల్సిపోయింది.

* * *

వేసవి మధ్యాహ్నం తన అరచేతి క్రింద నన్ను దాచింది. క్షౌరం చేయించుకున్న చెట్లు నాకే మాత్రం నీడనివ్వలేక పోతున్నాయ్. ఒక్కరూ నాకు తోడుగా లేరు. కనీసం కాకి కూడా అరవట్లేదు. నాలోంచి గత తొమ్మిది నెలల ఆలోచనలు పొగలాగ పైకి వస్తున్నాయి. ఆ నిశ్శబ్ద పరదాని ఛేదిస్తూ వచ్చి ఆగిందో కారు.

నా సూర్యకిరణం ఒకటి కారు మీద పడి పరావర్తనం చెందింది. డబ్బు చూస్తే దానికీ బెదురే. కారులోంచి దిగిన వ్యక్తి నా ముఖానికి దగ్గరగా వస్తున్నాడు. ఓ...అతను. ఆ రోజు మాట్లాడి వెళ్ళిపోయింతర్వాత ఇదే రావడం. దగ్గరగా వచ్చి ఆగాడు. రాగానే ఇదివరకట్లా మాట్లాడలేదు. ఎందుకో అతను విచారంగా ఉన్నాడు. అతని పెదవులపై కూడా వేసవి ఎండ కాస్తోంది. అతని కళ్ళలోకి సూటిగా చూశాను. డబ్బు వల్లనుకుంటాను, ఒక రకమైన నిస్తేజత అతని కళ్ళలో కన్పిస్తోంది.

అతను చెప్పాలనుకున్నదేదో నాకర్థం అయినట్టనిపించింది. అతని వెనకగా నుంచున్న డ్రైవర్ చిన్నగా దగ్గాడు. ఇంత ఎండలో అలా నామీద నిలబడ్డం అతని డ్రైవర్‌కి వింతగా అన్పించినట్టుంది. అతను ఉన్నచోటు నుండి కదలకుండానే వెనక్కి తిరిగి చూశాడు. తన జీవితాన్ని మలుపు తిప్పిన ప్రదేశాన్ని మళ్ళీ ఒక్కసారి తీక్షణంగా చూశాడు. అంతలోనే మళ్ళీ సర్దుకున్నాడు. డబ్బు అతని కళ్ళని తన తెరచాటున దాచేసింది.

ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చి వెనక్కి తిరిగాడు. నాకెందుకో అసంతృప్తిగా అనిపించింది. చెప్పాల్సిందేదో మిగిలిపోయిందని...ఒక అస్పష్టమైన భావం. చిన్న గాలి తెమ్మెర ఒకటి ఆ దారిన పోయింది. తనతోపాటు అతని శరీరం మీంచి మత్తైన పరిమళాన్ని తీసుకుపోయింది. అతను వెళ్ళిపోతున్నాడు. నేను తెగించి అతని కాలు పట్టుకున్నాను. అతను నిస్సహాయంగా గింజుకుంటున్నాడు.

నాలో ఏదో ఘోష మొదలైంది. ఓ మధ్యాహ్నం మేఘం సూర్యుడి మీంచి అవతలివేపుకి వెళ్ళింది. నాలో ఆలోచనలు ఉన్మత్త భుజంగాల్లా బుసలు కొడుతున్నాయి. అతను భయంతో విహ్వలుడై గింజుకుంటున్నాడు. నాలోని ఆలోచనలన్నీ ఒక్క పెట్టున తోసుకువచ్చేస్తున్నాయి. భాషకి అందని భావాలూ వాటిని వరసలో పేరుద్దామని ప్రయత్నిస్తున్నాను. అతను ప్రదూషమందలి ఛాయా శిఖవలె భయోద్విగ్నుంగా పెనుగులాడుతున్నాడు.

“మీరొదిలేయండి. ఏసంకాలం కదా బాబూ! తారు కరిగి చెప్పలు పట్టేత్తాయి”. నా నుంచి చెప్ప లాగుతూ అతనితో అన్నాడు డ్రైవర్. అతనొక్కసారిగా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

గబగబా వెళ్ళి కారులో కూర్చున్నాడు. నాలోని ఆలోచనలు తీగలా సాగాయి.

కారు స్టార్టయ్యింది. నేను చెప్పడం మొదలుపెట్టాను.

“అహం వదులు
ఇహం వదులు
సౌఖ్యానికదే మొదలు”

హోరుమంటూ కారు వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది. అతని కుషన్ చెప్ప గుర్తు నా మీద మిగిలిపోయింది.

* * *

నా చుట్టూ నిశ్శబ్దం పహరా కాస్తోంది. ఎవరో నలుగురు కుర్రాళ్ళు నడుచుకుంటూ వస్తున్నారు. వాళ్ళలో ఒకడు మరొకణ్ణి అడుగుతున్నాడు. “రేయ్! సరదాగా చిన్న కవిత చెప్పు”.

“దేనిమీద చెప్పను?”

“కాదేదీ కవిత కనర్హం! అందుచేత రోడ్డు మీద చెప్ప చూద్దాం” నా గురించి మాట రావడంతో ఆసక్తిగా వినడం మొదలుపెట్టాను. నడుస్తూనే చెపుతున్నాడతను.

“నామీంచి కార్లు పోతాయ్
మోటార్లు పోతాయ్
నాలోపల రాళ్ళుంటాయ్
నాపైన కాళ్ళుంటాయ్
నా చుట్టూ చెట్లుంటాయ్. నా ప్రక్కన లైట్లుంటాయ్”

“వహ్వా! వహ్వా!” హుషారు చేసారు స్నేహితులు.

క్రిందకి వంగి చేతిలోకో రాయి తీసుకుని “అవి వద్దన్నా నాకు నిజాలు చూపిస్తుంటాయ్” నవ్వుతూ ‘పూర్తి’ చేసాడతను.

అంతే ఒక్కసారిగా చీకటి నన్ను కౌగిలించుకుంది. ఎన్నాళ్ళ విరహం తర్వాతో.

స్నేహితులతో కలిసి వెళ్ళిపోతున్న ఆ కుర్రవాడికి ఆప్యాయంగా చెప్పాను “స్నేహితుడా! నీకు వేవేల కృతజ్ఞతలు.”

